
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

సోమవారం 17 మార్చి 2025





నరసరావుపేట ప్రాంతంలో పనులు చేస్తున్న ఉపాధి కార్మికులు

- నేటి నుంచి పది పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి
- ఫిర్యాదుల కోసం డీఈవో కార్యాలయాల్లో హెల్ప్‌లైన్
- హాల్‌టిక్కెట్‌పై విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

గంట ముందే కేంద్రాల్లోకి అనుమతి

నరసరావుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఆయా కేంద్రాల్లోకి గంట ముందు అనుమతిస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు. గంట ముందుగా అంటే ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉంటుందని సూచిస్తున్నారు. రోజు మార్చి రోజు నిర్వహిస్తున్నందున పరీక్షకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులకు సమయం దొరు కుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలపై వచ్చే ఫిర్యాదుల కోసం విద్యాశాఖ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, పరీక్ష జరిగే కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద యం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు అంటే ఎండల సమయంలో పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశా రు. కేంద్రాల వద్ద వైద్య సేవలకు ఏఎన్ఎమ్‌లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను కూడా అందుబాటులో ఉంచారు. ఏ ఒక్క విద్యార్థి కూడా కింద కూర్చోకుండా బెంచీలతో పాటు గాలి, వెలుగు ప్రస రించేలా ఆయా గదుల్లో ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల సౌకర్యం కోసం హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేసే అవకాశాన్ని ప్రభు త్వం కల్పించింది. అంతేగాకుండా కేంద్రాల వద్దకు అవసరాన్ని బట్టి ప్రత్యే క బస్సులు నడిపే ఏర్పాట్లను కూడా విద్యాశాఖ చేపట్టింది.

పల్నాడులో 128 కేంద్రాలు

పల్నాడు జిల్లాలో 26,497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా వీరిలో 13,415 బాలురు, 13,088 మంది బాలికలు ఉన్నారు. వీరి కోసం 128 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓపెన్ పరీక్షలు 27 కేంద్రాలను ఏర్పాటు చేయగా 1,200 విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు సంబంధించి జిల్లా పరిశీలకురాలిగా జేడీ గీతను ప్రభుత్వం నియ మించింది. 1680 మంది ఇన్విజిలేటర్లు, 280 వరకు చీఫ్ సూపరింటెం డెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు. జిల్లాలో ఎస్‌బీఆర్ నరసరావుపేట మున్సిపల్ పాఠశాల, రొంపిచర్ల మండలం విప్పర్ల రెడ్డిపాలెం, విజయపురిసౌత్ ప్రభుత్వ పాఠశాల, బొల్లాపల్లి మండలం బండ్లమోటు జడ్పీ హెచ్ఎస్, క్రోసూరు జడ్పీ, కారంపూడిలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వీటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 8341135357 నంబరు కేటాయించామని, ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుందని డీఈవో చంద్రకళ తెలిపారు.



పది కేంద్రంలో నెంబర్లు వేస్తున్న అధికారులు

కేంద్రాల వద్ద 144 సెక్షన్: ఎస్పీ శ్రీనివాసరావు

పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేస్తున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ఇన్విజిలేటర్లు, పరీక్షకు నియమించిన సిబ్బంది మినహా ఇతర వ్యక్తులు కేంద్రాల వద్ద ఉండరాదన్నారు. మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పా టు చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితు ల్లో సహాయం కోసం డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

పనులు చేసినా.. పస్తులే

వలసలు నివారించి.. స్థానికంగా పనులు కల్పిస్తూ.. కూలీలకు అండగా ఉపాధి హామీ పథకాన్ని అధికారులు అమలు చేయాలి. అయితే కూలీలతో పనులు చేయించుకుని వారికి ఇవ్వాల్సిన కూలి నగదును పెండింగ్ పెడుతున్నారు. పనులు చేసినా పస్తులు ఉండాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నా అధికారులు ఆలకించడంలేదు. ఒకటి రెండు రోజులు అయితే పర్వాలేదు కానీ రెండు నెలలుగా కూలీలతో పనులు చేయించుకుని రూ.41.25 కోట్లు బకాయి పెట్టారంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పనులు చేశాము.. ఖాతాల్లో నగదు జమ అవు తుందని కూలీలు రోజుల తరబడి ఎదురుచూస్తున్నా వారి ఆశలు అడియాశలవుతున్నాయి. జనవరి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదు. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకాయిలు కూడా రూ.131.06 కోట్లు ఉన్నాయి.

- ఉపాధి కూలీల ఆకలి కేకలు
- రెండు నెలలుగా అందని కూలి
- కూలీలకు రూ.41.25 కోట్లు.. సామగ్రికి రూ.131.06 కోట్ల బకాయి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు.. వేతనాలు అందక అల్లాడుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.41.25 కోట్లు బకాయిలు ఉండటంతో కూలీలకు వ్యథలు తప్పడం లేదు. కూలీలు చేసిన పనులకు వారం వారం కాదు కదా నెలకొకసారి కూడా కూలి చెల్లించడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వలసలు నివారించడం, వ్యవసాయ కార్మికులు, కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కార్మికుడికి కూలి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉండగా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. చేసిన పనికి వెను వెంటనే కూలి రాకపోతుండటంతో ఉపాధి పనులపై కార్మికులు ఆసక్తి చూపడంలేదు. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల వారీగా వారికి చెల్లించాల్సిన కూలి వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. కూలి వివరాల సేకరణ.. ఆన్‌లైన్‌లో నమోదు.. తదితర ప్రక్రియలు సక్రమంగా జరుగుతున్నా నగదు మాత్రం వారి ఖాతాల్లో జమ కావడంలేదు. జనవరి 15 నుంచి కూలి చెల్లించడంలేదు.

జాబ్ కార్డులు ఇలా..

పల్నాడు జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు నమోదు చేశారు. 5.77 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేయగా 4.53 లక్షల కార్డులు మాత్రమే యాక్టివ్‌లో ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 2.09 లక్షల కార్డులకు 1.51 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షలకు 3.74 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. నమోదు చేసుకున్న వారందరూ పనులకు హాజరు కావడంలేదు. పేరు నమోదు చేసుకోని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉంది. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపాధి పనుల్లో కార్మికుల పని దినాలను ముందుగానే అంచనా వేస్తున్నా ఆ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి.

బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పెద్దఎత్తు జరిగాయి. గోకులం షెడ్ తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. పల్లెపండుగ పథకం ప్రారంభంలో వారం.. వారం బిల్లుల చెల్లింపులు మొదటి రెండు వారాలు మాత్రమే జరిగాయి. ఆ తర్వాత నుంచి బిల్లుల చెల్లింపులు ఆగి పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పల్నా డు జిల్లాలో రూ.61.90 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.44.12, గుంటూరు జిల్లాలో రూ.15.04 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు కూడా చెల్లింపుల్లో జాప్యం జరుగు తుండటంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. కాగా పనులకు సంబం, ధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20, మార్చిలో 25, ఏప్రిల్లో 30 శాతం అదనపు కూలి ఇచ్చేవారు. మజ్జిగ కూడా సరఫరా జరిగేది. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకి రూ.13 చెల్లించేవారు. ప్రస్తు తం వీటినీ రద్దు చేశారు. దీంతో వేతన దారులపై ఆర్థికభారం పడుతోంది.

పర్యాటకంగా.. పల్నాడు అభివృద్ధి

- పల్నాడు చరిత్రను భావితరాలకు అందించాలి
- ఎంపీ లావు, ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటి
- నాగమ్మ ఆలయంలో అట్టహాసంగా శివలింగం పునః ప్రతిష్ఠ
- హాజరైన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యుడు జంగా

దాచేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, వైద అమరలింగేశ్వరస్వామి, సత్రశాల, నాగమ్మగుడి, అమరావతిని కలుపుతూ పర్యాటకంగా పల్నాడును అభివృద్ధి చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దాచేపల్లి మండలం గామాలపాడులో టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అధ్యక్షతన తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి పర్యవేక్షణలో ఆదివారం మరకత శివలింగం ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బొల్లా రాజగోపాల నాయుడు (బీఆర్ నాయుడు) పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చాపకూటి సిద్ధాంతం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన నాయకురాలు నాగమ్మ దేవాలయ ప్రాంతంలో వృద్ధాశ్రమం, అనాథ ఆశ్రమం, గోశాల నిర్మాణం చేపడతామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 272 అడుగుల ఎత్తులో రాజగోపురాన్ని నిర్మిస్తామన్నారు. శివస్వామి మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం భక్తి భావంతో, పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై యరపతినేని

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ..

నాయకురాలు నాగమ్మచే 11వ శతాబ్దంలో నిర్మించిన పార్వతీ సమేత చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య శివలింగ పునఃప్రతి ష్ఠాపన జరిగింది. వేద మంత్రాల మధ్య ఓం నమః శివాయ పంచాక్షరీలతో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరి గింది. ఈ కార్యక్రమాల్లో టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, విశ్వధర్మ పరిరక్షణ వేదిక సాధుపరివార్ స్వామీజీలు, మఠాధిపతులు, ఆశ్రమాధి పతులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మరకత లింగాన్ని ప్రతిష్ఠాపన చేస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే యరపతినేని, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా,శివస్వామి

మలుపులతో.. ముప్పు

- నెత్తురోడుతున్న రహదారులు
- హెచ్చరికలు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు

గురజాల టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై మలుపులు వాహన చోదకుల ప్రాణాలు తీస్తున్నాయి. ఎందరో క్షతగాత్రులుగా మారుతున్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఒక కారణమైతే.. అధికారులు పట్టించుకోకపోవడం మరో కారణం. ఆదమరిస్తే మూలమలుపులు మృత్యు పిలుపులుగా మారుతున్నాయి. రెంటచింతల నుంచి గురజాలలోకి వచ్చే రహదారి, గురజాల - గంగవరం రహదారి, పట్టణంలోని వాగ్దేవి కళాశాల వద్ద మూల మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈ మూల మలుపుల వద్ద హెచ్చరికలు, స్పీడు బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వాహన చోదకులు వేగంగా వస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణం చేయవద్దని అధికారులు సూచిస్తున్నా వాహనచోదకుల తీరు మారడం లేదు.



గురజాల : వాగ్దేవి కళాశాల వద్ద మలుపు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (సోమవారం సాయంత్రం) సహరి : 4.58 (మంగళవారం ఉదయం)

మున్సిపాలిటీల్లో డిజిటల్ చెల్లింపులేవి..?
- కేవలం నగదు వసూళ్లే..

కర్ణాటక మిర్చి కట్టడి!
- వాటి వలనే ఇక్కడి రకాలకు ధర రావడం లేదని రైతుల భావన

6

సగం మందికే పరిహారం

- ఎమ్మాజిగూడెం వాసులపై వివక్ష
- పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వతో కష్టాలు
- ముంపులో సురక్షిత ప్రాంతాలకు తరలింపుతో సరి
- గ్రామస్తుల గోడు పట్టించుకోని పాలకులు, అధికారులు

బెల్లంకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని ఎమ్మాజిగూడెం గ్రామం. అయితే ఈ గ్రామంలో సగం ఇళ్లకే పరిహారం ఇచ్చారు. గ్రామంలో మిగిలిన వారి గురించి అటు పాలకులు.. ఇటు అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన ప్రతీసారి మిగిలిన గ్రామస్తులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలింపుతో సరిపెడుతున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడంలేదు. తమ గ్రామానికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నష్ట పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమను పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాటూరు లైన్ ప్రకారం పులిచింతల ప్రాజెక్టు అధికారులు సగం గ్రామాన్ని మాత్రమే 2010లో ముంపు కింద తీసుకున్నారు. దీంతో గ్రామంలోని 98 మంది గృహాలకు నష్ట పరిహారం అందించారు. వారికి కొండమోడు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చారు. ఇంకా గ్రామంలో 126 గృహాల్లో ప్రజలు నివసిస్తున్నారు. వారంతా ఆ ఇళ్లలోనే ఉంటూ పొలాలు సాగు చేసుకుంటున్నారు. ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే గ్రామంలోకి నీరు ప్రవేశిస్తుంది. ఆ సమయంలో ఇళ్లలోకి విష సర్పాలు వస్తున్నాయని, పొలాలు మునిగి పోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన ప్రతీ సారి అధికారులు ఇళ్లు ఖాళీ చేయించి గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారే తప్ప పరిహారం గురించి పట్టించుకోవడంలేదు. ఇప్పటికే పీసీపీ నెంబర్లు ఇచ్చిన గృహాల యజమానులు సుమారు 30 మంది వరకు మృతి చెందారు. దీంతో తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని ఆయా కుటుంబీకులు వాపోతున్నారు. 2016లో మాచవరం మండలం రేగులగడ్డ గ్రామానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఒక్కొక్క గృహానికి సుమారు రూ.10 లక్షల నష్ట పరిహారం ఇచ్చారు. అలాగే తమ గ్రామానికి కూడా పరిహారం ఇవ్వాలని ఎమ్మాజిగూడం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఎమ్మాజిగూడెం ఏరియల్ వ్యూ

తమకూ రూ.15 లక్షలు ఇవ్వాలి

వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద తమ గ్రామంలో మిగిలిన వారికి కూడా రూ.15 లక్షలు ఇవ్వాలి. వరద సమయంలో పులిచింతల ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే గ్రామంలోకి నీరు చేరుతుంది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇప్పిస్తే గ్రామం ఖాళీ చేసి వేరొక చోట నివాసం ఉంటాం.





- బత్తుల ఆంజనేయులు, కొర్రపోలు పెద వెంకయ్య

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్) 2025 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మేథ్స్) అభ్యర్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో బీఈ/ బీటెక్/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఏప్రిల్ 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 2025 మే 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఎంట్రెన్స్‌ను అనంతపురంలోని జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. ప్రవేశ పరీక్ష 2025 మే 6వ తేదీన జరుగుతుంది. పూర్తి వివరాలకు https://cets.apsche.ap.gov.in/ APSCHE/APSCHEHome.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎన్‌సీఎల్‌లో 1,765 అప్రెంటిస్ పోస్టులు

అప్రెంటిస్ పోస్టుల భర్తీకి నార్తరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎన్‌సీఎల్) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 1,765 పోస్టులు ఉన్నాయి. ఇందులో గ్రాడ్యుయేట్స్ 152, డిప్లొమా 597, ట్రేడ్ అప్రెంటిస్ 941 ఉన్నాయి. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ nclcil.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 18. అభ్యర్థుల వయస్సు 2025 మార్చి1వ తేదీ నాటికి 18 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

గడువు పెంపు

'కొమెడెక్'

కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్లకు ఉద్దేశించిన కొమెడెక్ యూజీసెట్-2025కి (కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్, డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్నాటక) దరఖాస్తు దాఖలు గడువును పొడిగించారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఈ పరీక్షను ప్రతీ సంవత్సరం తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు రాస్తుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు https://comedk.org/ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 20 తేదీ వరకు పెంచారు. కరెక్షన్ విండో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు ఓపెన్‌గా ఉంటుంది. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష మే10న జరుగుతుంది. ఫలితాలు మే 24న వెల్లడిస్తారు.

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ దరఖాస్తు దాఖలు గడువును 2025 మార్చి 31 వరకు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ వివరాలను తెలిపింది. తొలుత ఈ గడువు 2025 మార్చి 12 వరకు ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కీమ్ ద్వారా భారతదేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. ఇందులో ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, ట్రావెల్ - హాస్పిటాలిటీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ తదితర రంగాలు ఉన్నాయి. రిలయన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్ర, బజాజ్ ఫైనాన్స్, మహీంద్ర అండ్ మహీంద్ర మొదలైన దిగ్గజ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. పదో తరగతి అర్హత ఉన్నవారు మొదలుకుని గ్రాడ్యుయేషన్ వరకు అందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

మంచి కాలేజీ అయితేనే సరైన ప్లేస్‌మెంట్

దిక్సూచి DIKSUCHI

ఐసెట్ ప్రిపరేషన్ ప్లాన్



తెలుగు రాష్ట్రాల్లో ఎంబీఏ లేదా ఎంసీఏ(మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) చేయాలంటే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. ఈ పరీక్షలో ర్యాంకు సాధిస్తే మంచి కాలేజీలో సీటు సంపాదించవచ్చు. ఏదో ఒక కాలేజీలో సీటు సులభమే. కానీ ప్లేస్‌మెంట్ సరిగ్గా ఉండాలంటే మాత్రం తప్పనిసరిగా మంచి కాలేజీలో చదవాలి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఐసెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లో మే మొదటివారంలో ఎంట్రెన్ జరుగుతుండగా, తెలంగాణలో జూన్ మొదటి వారంలో నిర్వహిస్తున్నారు. రెండు సెట్‌ల పరీక్షల స్వరూపం ఒక్కటే. మొత్తం ప్రశ్నలు 200 ఉంటాయి. కామన్‌గా మూడు సెక్షన్లు ఉంటాయి. అవి అనలిటికల్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఈ ప్రశ్నలు ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ ఉండోచ్చు. ఐసెట్ ఎంట్రెన్స్ రాయాలంటే కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేన్ పూర్తి చేయాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా పరీక్ష రాయవచ్చు. ఎంసీఏలో చేరాలంటే మాత్రం ఇంటర్‌లో మేథ్స్ చదివి ఉండాలి. ఐసెట్‌లో 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలు పూర్తి చేయాలి. అంటే ప్రతీ ప్రశ్నకు 45 సెకన్లు మాత్రమే సమయం ఉంటుందన్నమాట. అనలిటికల్, మేథమెటికల్ ఎబిలిటీల వంటి సెక్షన్లకు ఈ సమయం సరిపోదు. ఎంత ఎక్కువ ప్రాక్టీసు ఉంటే అంత వేగంగా సమాధానాలు గుర్తించగలుగుతారు. షార్ట్‌కట్‌లు తెలుసుకోవాలి. సమాధానం రాకుంటే సమయం వృథా కాకుండా పరీక్ష చివర్లో ప్రయత్నించాలి. సాధారణంగా 150 నుంచి 170 మధ్య టాప్ స్కోర్లు ఉంటాయి. 120 దాటిన వారికి కూడా మంచి కాలేజీల్లో సీట్లు లభించే అవకాశం ఉంటుంది. ఫలానా కాలేజీలో ఈ స్కోరుకు సీటు పక్కా అని చెప్పడానికి ఉండదు. ప్రతీ సంవత్సరం మారే అవకాశం ఉంటుంది. అందుకే సాధ్యమైనంత మంచి ర్యాంకు తెచ్చుకోవాలి.

నోటిఫికేషన్ వివరాలు

- తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 (టీజీ ఐసెట్) నోటిఫికేషన్ విడుదల అయింది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ దీనిని నిర్వహిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మే 3. ప్రవేశ పరీక్ష 2025 జూన్ 8, 9వ తేదీన నిర్వహిస్తారు.
- ఏపీ కామన్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఐసెట్) కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. 2025 ఏప్రిల్ 9 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష 2025 మే 7న జరుగుతుంది.

అడ్మిషన్స్

ఏపీ 'ఈఏపీసెట్'



ఆంధ్రప్రదేశ్ 'ఈఏపీసెట్' దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలనుకున్న విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 24. కరెక్షన్లకు మే 6వ తేదీ నుంచి మే 8 వరకు అవకాశం ఉంటుంది. మే 12 నుంచి ఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటు, రాష్ట్రప్రభుత్వ వాట్సాప్ నంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాస్యూటికల్ కోర్సులకు ఎంట్రెన్స్ మే 19, 20 తేదీల్లో, ఇంజనీరింగ్ కోర్సులకు మే 21 నుంచి 27 నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 46 కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచుకున్నవారు కర్నూలులోని ప్రాంతీయ కేంద్రంలో ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది.

ఎంట్రెన్స్ విధానం:

- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 80 మేథ్స్, 40 ఫిజిక్స్, 40 కెమిస్ట్రీ నుంచి ఉంటాయి. ఇవన్నీ కూడా ఆబ్జెక్టివ్, మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు.
- అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ ప్రశ్నపత్రంలో కూడా 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో బయాలజీ 80(బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 ఉంటాయి.

ఫీజు: దరఖాస్తుతోపాటు జనరల్ అభ్యర్థులు రూ.600/-, బీసీ అభ్యర్థులు రూ.550/-, ఎస్సీఎస్టీ అభ్యర్థులు రూ. 500/- చెల్లించాలి.

SCHOLARSHIP ALERT

DRBT
Summer Internship Programme

IDRBT Summer Internship Programme (ISIP) 2025 is provided by the Institute for Development and Research in Banking Technology (IDRBT). The internship offers graduate and postgraduate students an opportunity to carry out projects in technological field.

Eligibility: Application is open to students enrolled in recognised post-graduate technology/management programs or four-year engineering degree course in reputed Indian institutions. Only those in their penultimate year of studies are eligible.

Rewards: A monthly stipend of Rs.12,500/-
Last Date to Apply: 15-04-2025
Application mode: Via email: isip@idrbt.ac.in
Short Url: www.b4s.in/aj/IDSI1



Flipkart Foundation Scholarship

Flipkart Group is committed to strengthening the retail sector including the Kirana Stores which form a significant part. As part of our endeavour, the Flipkart Foundation is supporting a scholarship for children of Kirana Store Owners to make them future-ready. This scholarship is dedicated to empowering children of Kirana Store Owners enrolled in professional STEM (Science, Technology, Engineering, Math) undergraduate programs.

Eligibility: Applicants must be currently studying in the 1st year of professional undergraduate STEM (Science, Technology, Engineering, Math) courses at government colleges in India.

- One parent must be a Kirana Store Owner (KSO).
- Applicants must have scored at least 60% in their Class 12 exams.
- The annual family income should not exceed INR 5 lakh from all sources.

Rewards: Fixed scholarship of INR 50,000
Last Date to Apply: 16-04-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/FLIP1

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కోర్ట్ నన్ను గెలిపించింది

నాని



ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీష్ తెరకెక్కించిన చిత్రం 'కోర్ట్'. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం విజయవంతంగా కొనసాగుతోన్న సందర్భంగా మేకర్స్ ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. నాని మాట్లాడుతూ "నేను ఎప్పుడూ స్క్రిప్ట్, ప్రేక్షకుల అభిరుచినే నమ్ముతాను. ఈ సినిమా నన్ను, నా నమ్మకాన్ని గెలిపించింది" అని అన్నారు. "ఈ సినిమా కథ విని చాలా గొప్ప అనుభూతిని పొందాను" అని ప్రియదర్శి చెప్పారు. "జీవితాలనే మార్చేయగల శక్తి సినిమా సొంతం. ఈ విజయం చిత్రబృందానికి అంకితం" అని రామ్ జగదీష్ అన్నారు.

విలన్ వస్తున్నాడు



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్ 2 ఎంపురాన్'. ఈ నెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. అయితే ఈ చిత్రం విడుదల వాయిదా పడిదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీన్ని ఖండిస్తూ చిత్రబృందం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 27న 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపింది. 'సరైన సమయమిది. అందరూ జాగ్రత్తగా ఉండండి. విలన్ మీ కోసం వచ్చేస్తున్నాడు' అంటూ పృథ్వీరాజ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

అన్ని వర్గాలనూ అలరిస్తుంది

నవీన్ యెర్నేని



సుశాంత్, జాన్యజోషి, విధి నటించిన హిందీ చిత్రం 'పింటూ కి పప్పీ'. ఈనెల 21న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా పలు భాషల్లో విడుదలవుతోంది. శివ్ హరే దర్శకత్వంలో విధి ఆచార్య నిర్మించారు. తెలుగులో 'కిస్ కిస్ కిస్సిక్' పేరుతో విడుదలవుతోంది. మురళీశర్మ, గణేశ్ ఆచార్య విజయ్‌రాజ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ "సినిమా రషెస్ చూశాను. చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలున్నాయి. తొమ్మిది పాటలూ అద్భుతంగా ఉన్నాయి. సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. గణేశ్ ఆచార్య మాట్లాడుతూ "అందమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యూత్‌నూ ఆకట్టుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని చెప్పారు. హీరో సుశాంత్ మాట్లాడుతూ "సినిమా మంచి కమర్షియల్ ప్యాకేజీలా ఉంటుంది" అని తెలిపారు.

ఆగస్టులోనే రెండో యుద్ధం



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'వార్-2'. అర్యన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తోంది. కాగా, ఈ సినిమాను ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించింది. అయితే కొన్ని రోజుల క్రితం షూటింగ్‌లో హృతిక్ కాలికి గాయం అవడం వల్ల చిత్రీకరణకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల మరింత జాప్యం జరిగి విడుదల వాయిదా పడుతుందంటూ బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరిగింది. దీన్ని చిత్రబృందం ఖండించింది. హృతిక్ కోలుకోగానే మిగిలిన భాగాన్ని పూర్తి చేసి, ముందు ప్రకటించిన విధంగానే ఆగస్టు 14న 'వార్ 2'ను విడుదల చేస్తామని యూనిట్ పేర్కొంది.

వినోదం గ్యారంటీ



నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. ఈనెల 28న విడుదలవుతోంది. చిత్రబృందం భీమవరంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో హీరో నితిన్ మాట్లాడుతూ "సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచదు. పూర్తి వినోదం గ్యారంటీ" అని అన్నారు. "మనసుపెట్టి తీసిన చిత్రమిది. కచ్చితంగా మీ అంచనాలను అందుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని వెంకీ కుడుముల చెప్పారు. "ఈ సినిమాను థియేటర్లలో మీ కుటుంబసభ్యులతో మిత్రులతో కలసి చూడండి. బాగా ఎంజాయ్ చేస్తారు" అని వై. రవిశంకర్ తెలిపారు.

'పుష్ప 3'.. మరో మూడేళ్లలో



అల్లుఅర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప 2: ద రూల్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఆ చిత్రానికి కొనసాగింపుగా 'పుష్ప 3: ద ర్యాంపేజ్' ఉంటుందని మేకర్స్ అప్పట్లోనే ప్రకటించారు. 'రాబిన్‌హుడ్' ప్రెస్‌మీట్‌లో 'పుష్ప 3' గురించి నిర్మాత వై. రవిశంకర్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. "పుష్ప 3'ని 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అల్లు అర్జున్ ప్రస్తుతం తను చేయబోయే ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు" అని ఆయన తెలిపారు.

సంక్రాంతి కానుకగా మెగాస్టార్ సినిమా

- అనిల్ రావిపూడి



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తను దర్శకత్వం వహిస్తున్న చిత్రం వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తుందని ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. తన ఆరాధ్య దైవం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో ఆదివారం ఆయన సినిమా స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. తన బృందంతో కలిసి ఆదివారం ఉదయం సింహాచలం చేరుకున్న అనిల్ రావిపూడి ముందుగా ఆలయంలో కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ ఇమేజ్‌కు తగ్గట్లుగా ఈ సినిమాకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 90 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, మరో నెలరోజుల్లో సెట్స్‌మీదకు వెళ్తామన్నారు. మూడు నెలల షూటింగ్ పార్టు అనంతరం, పోస్టు ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకుని వచ్చే సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. మెగాస్టార్ సినిమాల్లో పాటలు, సంగీతానికి ఉండే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భీమ్స్‌ను సంగీత దర్శకుడిగా ఎంచుకున్నామన్నారు. ప్రముఖ నేపథ్య గాయకుడు రమణ గోగులతో పాటలు పాడించాలని నిర్ణయించామని తెలిపారు.

సింహాచలం (ఆంధ్రజ్యోతి)





కొత్త తేదీన జాన్వీ చిత్రం

వరుణ్ ధావన్, జాన్వీకపూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారి'. ఈ చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలవ్వాల్సి ఉంది. అయితే సెప్టెంబర్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణసంస్థ ధర్మా ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, భావోద్వేగాల మిళితంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని యూనిట్ పేర్కొంది. 'బవాల్' తర్వాత వరుణ్, జాన్వీ జంటగా నటిస్తున్న చిత్రమిది. శశాంక్ ఖేతన్ దర్శకత్వం వహిస్తున్నారు. రోహిత్ సరాఫ్, సన్యా మల్హోత్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

రెహ్మాన్‌కు అస్వస్థత

- చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ. ఆర్ రెహ్మాన్ ఆదివారం ఉదయం స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే ఆయన్ను చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత ఆయన డిశ్చార్జ్ అయ్యారు. డీహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్య కారణంగా ఆయన ఒకింత అస్వస్థతకు గురవ్వడంతో, ఇందు కోసం చికిత్స తీసుకున్నారని రెహ్మాన్ సోదరి రెహానా వెల్లడించారు. 'డీ హైడ్రేషన్, గ్యాస్ట్రిక్ ట్రబుల్ కారణంగా రెహ్మాన్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స తర్వాత కోలుకున్నారు. మధ్యాహ్నం ఆయనను డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించాం' అని వైద్యులు పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హాస్పిటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి రెహ్మాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మాజీ భార్య అనొద్దు : సైరా బాను



రెహ్మాన్ అనారోగ్యానికి గురయ్యారంటూ వచ్చిన వార్తలపై ఆయన భార్య సైరా బాను స్పందించారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అలాగే, తన గురించి ప్రస్తావించేటపుడు రెహ్మాన్ మాజీ భార్య అని పిలవొద్దు అని ఆమె కోరారు. తాము ఇంకా అధికారికంగా విడాకులు తీసుకోలేదన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, అందుకే రెహ్మాన్‌కు దూరంగా ఉంటున్నాననీ ఆమె వెల్లడించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు



ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దీపికా పిల్లి కథానాయిక. మాంక్స్ అండ్ మంకీస్ బేనర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం విడుదల తేదీని ప్రకటించింది. ఏప్రిల్ 11న 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. కొత్త తరహా ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిదనీ, కుటుంబ ప్రేక్షకులను, యువతను ఆకట్టుకునే హంగులతో తెరకెక్కించామనీ మేకర్స్ తెలిపారు. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రధన్ సంగీతం అందిస్తున్నారు. కథ, మాటలు: సందీప్ బొల్లా, సినిమాటోగ్రఫీ:ఎంఎన్ బాల్‌రెడ్డి, ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్

బగళాముఖి అమ్మవారి సన్నిధిలో జస్టిస్ రజని

పిట్టలవానిపాలెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని, వెంకటరత్నాకరరెడ్డి దంపతులు ఆదివారం విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి కార్యనిర్వహణాధికారికి లిఖితపూర్వకంగా అనేక సూచనలు చేశారు. మీ సూచనలను ఉన్నతాధికారుల అనుమతితో తప్పనిసరిగా పాటిస్తానని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, బాపట్ల తహసీల్దార్ షేక్.సలీమా, పిట్టలవానిపాలెం తహసీల్దార్ ధూళ్ళిపూడి వెంకటేశ్వరరావు, పోలీసు, రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని దంపతులను ఆలయం తరఫున దుశ్శాలువా, శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.



శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని, వెంకటరత్నాకరరెడ్డి దంపతులు

విద్యార్థులకు టాబ్లెట్స్ విక్రయిస్తున్న మహిళ అరెస్టు



టాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పీ గీతిక

బాపట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామం వృక్షనగర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న టాబ్లెట్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.గీతికలు ఆదివారం పట్టుకున్నారు. సీఐ గీతిక తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామంలో పోలా విజయలక్ష్మి అనే మహిళ విద్యార్థులకు టాబ్లెట్స్ విక్రయిస్తుందని సమాచారం వచ్చిందన్నారు. వైద్యులు వీటిని పెయిన్ కిల్లర్స్‌గా ఇస్తుంటారని, అయితే ఇక్కడ ఈ టాబ్లెట్స్ ఎక్కువగా వేసుకుంటే యువత మత్తులోకి వెళతారని చెప్పి విక్రయిస్తున్నారు. వీటిని వినియోగించటం వల్ల గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ఏవిధమైన అనుమతులు లేకుండా విద్యార్థులకు వీటిని విక్రయిస్తున్నట్లు గుర్తించి ఆమె వద్ద ఉన్న 1600 టాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ టాబ్లెట్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.

ఉడుతకే... సాయం

తెనాలి, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు శ్రీరాముడికే లంకకు వారధి కట్టే విషయంలో సాయం అందించిన ఉడుతకు ఇక్కడ ఓ జంతు ప్రేమికుడు సాయమందించాడు. అతను చేసిన సాయానికి కృతజ్ఞతగా ఆ రెండు ఉడుత పిల్లలు అతనిని వదలకుండా అతనిపైకే ఎక్కి ఆడుకోవటం, తోలినా వెళ్లకుండా చుట్టూ తిరుగుతుండటం చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది. తెనాలిలోని జంతు ప్రేమికుడు తన్నీరు శివశంకర్‌కు సామాజిక సేవకుడు, జంతు ప్రేమికుడుగా మంచి పేరుంది. ఆదివారం తన దుకాణం దగ్గర బయట కూర్చుని ఉంటే, రెండు ఉడుత పిల్లలు తన చుట్టూ తిరగటం గమనించాడు. తల్లి కనిపించకపోవటం, అవి ఆకలితో ఉన్నట్టు గుర్తించి పాలు కొనితెచ్చి, ఒక సిరంజ్‌తో పాలు పట్టి వాటికి అందించాడు. అయితే అవికూడా అంతే ఆకలితో సిరంజ్‌ను పట్టుకుని వదలకుండా పాలన్నీ తాగేయటం చూస్తే వాటి ఆకలి ఒకింత బాధను కలిగించింది. అయితే పాలు తాగిన తర్వాత వెళ్లిపోకుండా ఆ రెండు ఉడుత పిల్లలు అతని చుట్టూనే తిరుగుతూ ఉండిపోయాయి.





ఉడుతలకు సిరంజ్‌తో పాలుపడుతున్న శివశంకర్

ఇక మొదలెడదామా...!

- సెలవులు ఇవ్వకుండానే ఇంటర్ తరగతులు
- 24 నుంచి తరగతులని ఆదేశాలు
- అనధికార అడ్మిషన్ టెస్టులు మొదలు

గుంటూరు (విద్య) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగిసి వారం రోజులు కాకుండానే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు ప్రైవేట్ కళాశాలలో ప్రయత్నాలు ప్రారంభించాయి ఇప్పటికే విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఫోన్లకు సమాచారం పంపి తరగతులకు పంపించాలని ఒత్తిడి తెస్తున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ఈనెల ఒకటి నుంచి ప్రారంభమై ఈనెల 13తేదీతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 65 వేల మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగిసి వారం రోజులు కాకుండానే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని సమాచారం పంపడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సంవత్సరం మొత్తం తీవ్ర ఒత్తిడి మధ్య చదివిన విద్యార్థులకు కనీసం నెలరోజులు కూడా సెలవులు ఇవ్వకపోవడంతో వారు మానసికంగా కుంగుబాటుకు గురి అవుతున్నారు. దీనికితోడు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో తరగతులు ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై సాయంత్రం 8 గంటల వరకు నిర్వహిస్తారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కనీసం సెలవు రోజుల్లో కూడా వారిని వదలకుండా క్లాసులు నిర్వహించడం మరింత ఆందోళన పరిచే విషయం.

అనధికార టెస్టులకు రంగం సిద్ధం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు అడ్మిషన్ల కోసం ఎటువంటి టెస్టు నిర్వహించరాదు. అయితే కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు టెస్టులు నిర్వహించి తమ సంస్థల్లో అడ్మిషన్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఈ విషయం గురించి ఇంటర్ బోర్డు, పాఠశాల విద్యాశాఖ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పుడు క్లాసులు నిర్వహిస్తే, ఒక వైపు మండే ఎండలు, మరోవైపు తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. రెగ్యులర్‌గా ఇంటర్ తరగతులు ప్రారంభం అయ్యే నాటి కి దాదాపు సగం సిలబస్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశా ర ని, దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని ఓ కార్పొరేట్ కళాశాలలో పనిచేసే అధ్యాపకుడు ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంకోవైపు తరగతులకు పంపకపోతే "మీ పిల్లలు చదువులో వెనుకబడిపోతారని" తల్లిదండ్రులను మానసికంగా బ్లాక్ మెయిల్ చేసేస్థాయికి ప్రైవేటు,కార్పొరేట్ కళాశాలలు చేరాయి. ఇప్పటికైనా ఇంటర్ బోర్డు అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.



ఇటీవల పరీక్షలు పూర్తిచేసుకుని వస్తున్న ఇంటర్ విద్యార్థులు

'సాయి సాధన' బాధితుల వాంగ్మూలం నమోదు

నరసరావుపేట లీగల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి), భారీగా డిపాజిటర్లను, చిట్ చందాదారులను మోసగించిన కేసులో సాయి సాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావుపై నమోదైన కేసుల దర్యాప్తు వేగం పుంజుకుంది. అధికారికంగా 500మంది బాధితులు ఇప్పటివరకు తేలారు. వీరిలో ఇప్పటివరకు 300మంది తమ వాంగ్మూలాలను సంబంధిత అధికారులకు అందజేశారు. గత మూడు రోజులుగా నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో మకాంవేసిన సిట్ బృందానికి 100మంది బాధితులు తమ వాంగ్మూలాలను ఇచ్చినట్లు సమాచారం. అధికారికంగా చిట్‌ఫండ్ చందాదారులకు 47 కోట్ల రూపాయల మేరకు బకాయి ఉందని, పుల్లారావుకు రావాల్సిన నగదు రూ.12కోట్ల మేరకు ఉన్నట్లు సమాచారం. బాధితులు ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడంతో.. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం కేసు దర్యాప్తునకు ఐపీఎస్ వకుల్‌జిందాల్ అధ్యక్షతన సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు యావత్తు సిట్ బృందం చేతికి చేరింది. సిట్ బృందం మూడు విభాగాలుగా కేసును అన్నికోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, డిపాజిటర్ల సొమ్ము తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా ముందస్తు బెయిల్ కోసం పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ ఈ నెల 17వ తేదీన విచారణకు రానుంది.

కర్ణాటక మిర్చి కట్టడి!

- వాటి వలనే ఇక్కడి రకాలకు ధర రావడం లేదని రైతుల భావన
- అక్కడి నుంచి ఎక్కువగా మిర్చిని తెప్పించడంలో వ్యాపారుల పాత్ర
- ఈ వారంలోనే మార్కెటింగ్ శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్బడిముబ్బడిగా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)ని ముంచెత్తుతోన్న కర్ణాటక రాష్ట్ర మిర్చిని కొంతమేరకు కట్టడి చేయాలని మార్కెటింగ్ శాఖ భావిస్తున్నది. మార్కెట్‌కి నిత్యం రైతులు తీసుకొస్తున్న లక్షా 30 వేలకు పైగా మిర్చి టిక్కీల్లో 50 శాతం వరకు ఆ రాష్ట్రానికి చెందిన రైతులు తీసుకొస్తున్నవే ఉంటున్నాయి. పైగా అవి అధిక తేమ శాతంతో కూడుకుని ఉంటుండటంతో వ్యాపారస్థులు ధర పెంచడం లేదు. ఆ మిరపకాయలను కోల్డ్‌స్టోరేజ్‌లలో కూడా నిల్వ చేయలేని పరిస్థితి ఉండటంతో వ్యాపారస్థులు నిర్ణయించిన ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి రైతులు తీసుకొస్తున్న మిర్చికి కూడా ధర రావడం లేదు.

ప్రస్తుతం మిర్చియార్డుకు ఎక్కువగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి, హుబ్లీ, హోస్పేట తదితర ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని ఎక్కువ మోతాదులో తీసుకొస్తున్నారు. వీళ్లతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ చుట్టుపక్కల నుంచి కూడా రైతులు మిర్చిని ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఇందుకు కారణం ఆయా రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడ వ్యాపారస్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, మిర్చిని అమ్మిపెట్టిన రోజునే నగదుని వాళ్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటమే. అయితే ప్రస్తుతం అక్కడి రైతులు మూడో కోత మిరపకాయలను తీసుకొస్తు న్నారు. సరిగా ఆరబెట్టకుండా తెచ్చేస్తున్నారు. అలానే వాటిల్లో తాలుకా యల శాతం కూడా ఎక్కువగానే ఉంటున్నది. ఈ మిర్చి టిక్కీలను విప్పి చూస్తూనే ఎక్స్‌పోర్టర్లు ధర తగ్గించేస్తున్నారు. అలానే బంగ్లాదేశ్‌లో రంజాన్ పండగ కారణంగా అక్కడి నుంచి దిగుమతి ఆర్డర్లు తక్కువగా ఉంటున్నాయని మిర్చి కమీషన్ వ్యాపారి పమిడి కృష్ణ తెలిపారు.

వారంలో ఐదు రోజులు మాత్రమే వాణిజ్యం జరిగే గుంటూరు మిర్చియార్డులో వ్యాపారస్థుల అంచనా ప్రకారం కర్ణాటక నుంచి లక్షన్నర టిక్కీల వరకు వస్తున్నాయి. తెలంగాణ నుంచి 15 వేల టిక్కీల వరకు వస్తున్నట్లు చెబుతున్నారు. వీటి ప్రభావం మార్కెట్‌పై గణనీయంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల నుంచి మిర్చిని ఏప్రిల్ మొదటి వారం వరకు కట్టడి చేయాలని మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. కోత జరిగిన తర్వాత కనీసం మూడు వారాల పాటైన ఎండబెట్టుకుని తీసుకురావాలని కోరేందుకు సిద్ధమయ్యారు. దీనివలన ఇక్కడి మిర్చి రకాలకు డిమాండ్ పెరిగి ధర క్వింటాల్ రూ. 15 వేలు దాటిపోతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తేజ రకం మిర్చికి రూ. 11,500 మాత్రమే లభిస్తున్నది. టాప్ క్వాలిటీ అయితే రూ. 13 వేలు వస్తున్నది. మిగిలిన రకాలకు రూ. 9,500 నుంచి రూ. 11,500 వరకే ధర లభ్యమౌతున్నది.



ఐక్య పోరాటాలకు సమాయత్తం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గుంటూరు(తూర్పు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలు, కష్టజీవులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆది, సోమవారం రెండు రోజుల పాటు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో రామకృష్ణ ప్రసంగించారు. దేశంలో పేదరికాన్ని తగ్గించే ఎటువంటి చర్యలు కనబడటం లేదన్నారు. వ్యవసాయ కార్మికులు కోట్లాది మంది ఉన్నారని, వారికి 200 పనిదినాలు కల్పించాలని, దానికి బడ్జెట్లో రూ.4.50 లక్షల కోట్లు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ కేవలం రూ.85 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సంక్షేమ కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించడంతో పాటు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ పాలనను నిర్లక్ష్యం చేస్తున్నాడని విమర్శించారు. 'ఉపాధి హామీ పథకం అమలు-అడ్డంకులు-మన కర్తవ్యం', గ్రామీణ కష్టజీవులు-సంక్షేమం అభివృద్ధి- సామాజిక న్యాయం' అనే అంశాలపై లిఫ్టిక్ సంస్థ డైరెక్టర్ చక్రధర్ బుద్ధ, డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లాడారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రభాకర్, ఆవుల శేఖర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కే రామకృష్ణ, పాల్గొన్న సీపీఐ నాయకులు

సబ్‌జైళ్లలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తనిఖీలు

సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన



సత్తెనపల్లి సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

సత్తెనపల్లి, గురజాల లీగల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి, గురజాల సబ్‌జైళ్లను ఆదివారం గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తనిఖీ చేశారు. ఆయా జైళ్ల పరిసరాలను పరిశీలించి, రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. సత్ ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. ఆర్థిక స్థోమత లేక న్యాయ సహాయం అవసరమైన నిందితులకు ఉచితంగా అందిస్తామన్నారు. జైళ్లలో ఉన్న సౌకర్యాలను, ఆహారం, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జియావుద్దీన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి వీ విజయకుమార్‌రెడ్డి, ప్రధాన సివిల్ జడ్జి కౌశిత్ హుస్సేన్, ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సత్తెనపల్లి సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, గురజాల సబ్‌కోర్టు న్యాయమూర్తి వై శ్రీనివాసరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పీ అలేఖ్య, జైలు విజిటింగ్ న్యాయవాది కలివెల ప్రభుదాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం శ్రీనివాసరెడ్డి, న్యాయవాది చెన్నకేశవరావు, సబ్‌జైలు సూపరింటెండెంట్ అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో డిజిటల్ చెల్లింపులేవి..?

కేవలం నగదు వసూళ్లే....

గుంటూరు కార్పొరేషన్, తెనాలి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మున్సి పల్, కార్పొరేషన్ కార్యాలయాల్లో ఆస్తి పన్ను చెల్లింపులకు కౌంటర్లలో కేవలం నగదు మాత్రమే స్వీకరిస్తున్నారు. పన్నుల చెల్లింపులో పలు శాఖలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను, మొబైల్ ఫోన్ ద్వారా గూగుల్ పే, ఫోన్ పే సౌలభ్యాలు ఉన్నప్పటికీ వాటిని చెల్లింపు దారులకు అందుబాటులోకి తేవడంలో మున్సిపల్ శాఖ విఫలమైంది. గతంలో ఉన్న పుర సేవా యాప్ కూడా తొలగించారు. ఈ యాప్ ద్వారా పన్ను చెల్లించడంతో పాటు గతంలో చెల్లించిన వివరాలు, రశీదులు కూడా లభ్యమయ్యేవి. ఆన్‌లైన్‌లో సీడీఎంఏ పేమెంట్ విభాగం ఉన్నప్పటికీ సక్రమంగా పని చేయడం లేదంటున్నారు. కేవలం నగదు మాత్రమే కౌంటర్‌లలో తీసుకుండటంతో వడ్డీ ఎంతో తెలియక తక్కువ తీసుకు వెళ్లే చెల్లింపుదారులు నగదు కోసం మళ్లీ ఏటీఎంల వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

రాష్ట్రంలోని నాలుగో పెద్ద నగరంగా పేరుపొందిన గుంటూరు నగర పాలక సంస్థ కూడా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. దీంతో గుంటూరు పట్టణ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గుంటూరు మార్కెట్ వద్ద గల ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్ లోని సర్కిల్ కార్యాలయం వద్ద మాత్రమే ఆస్తి పన్ను చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆ కౌంటర్ల వద్ద ఆస్తిపన్ను చెల్లింపు దారులు గంటలకొద్దీ క్యూ లైన్‌లో వేచి ఉండి పన్ను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాదు వేసవిలో వడదెబ్బ ఇబ్బంది కూడా లేకపోలేదు.

జీఎంసీ కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది గతంలో పన్ను చెల్లింపు దారులకు నకిలీ రసీదులిచ్చి, ఆ నగదును స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను నగదు చెల్లింపులకు అందుబాటులోకి తేవాలని చెల్లింపుదారులు కోరుతున్నారు.

నేడు ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల విధుల బహిష్కరణ

గుంటూరు మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు తమ ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు ఏపీ వైద్యసేవ ఎంప్లాయీస్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమారి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విధులు బహిష్కరించి జిల్లా సమన్వయ అధికారి కార్యాలయం దగ్గర శాంతియుత నిరసన తెలియజేస్తున్నామన్నారు.

ఉద్యమ బాటలో.. ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం


- రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు వెల్లడి

గుంటూరు మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ 28 ఆర్థికేతర అంశాలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ త్వరలో ఉద్యమబాట పడుతున్నట్లు ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ ఆస్కారరావు ప్రకటించారు. కలెక్టరేట్ పక్కన గల డ్రైవర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం జరిగిన ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్కారరావు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని గతంలో పలుసార్లు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేసినా నేటికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. త్వరలో తమ సంఘం తరఫున ప్రభుత్వానికి సమ్మె నోటీసు జారీ చేసి, 15 రోజుల తర్వాత దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ టీడీకే సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే అహోరేన్, ముఖ్య సలహాదారు ఎస్‌వీ రమణ, కోశాధికారి ఎస్ బాబా సాహెబ్, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, సయ్యద్ చాంద్ బాషా, దుర్గా ప్రసాద్, సత్యనారాయణబాబు, అపరంజమ్మ, శేష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించి వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్ణయించారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



వెంకటసత్యం (ఫైల్)

వెల్దుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం జరిగింది. మండలంలోని గుండ్లపాడుకు చెందిన ఉప్పుతోళ్ల వెంకటసత్యం (23), మంజుల నవీన్, మణికంఠలు మండలంలోని ఉప్పలపాడు నుంచి ద్విచక్ర వాహనంపై వెల్దుర్తి వస్తున్నారు. వెల్దుర్తిలోని కళ్యాణ మండపం వద్ద బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటసత్యం అక్కడికక్కడే మృతిచెందగా నవీన్, మణికంఠలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు వెంకటసత్యం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 519.20 అడుగులు ఉంది. ఇది 147.82 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,277 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	91, 99, 110
చికెన్ విత్ స్కిన్(కిలో)	176.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	186.00

పేదల ఆరోగ్యానికి చంద్రబాబు భరోసా

సత్తెనపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం టీడీపీ ప్రజావేదికలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, కనుమూరి బాజీచౌదరి, గోగినేని కోటేశ్వరరావు, ముక్కపాటి రామచంద్రరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, సాగి శ్రీను, నూర్ బాషా జానీబాబు, పూజల వెంకట కోటయ్య, కట్టా శంకరరావు, భాస్కర్‌రెడ్డి, గుజ్జర్లపూడి స్టాలిని, కూటమి నేతలు పాల్గొన్నారు.

31 లోగా గృహనిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలి

నకరికల్లు, మార్చి 16(ఆంధ్రజ్యోతి) :ఈనెల 31వ తేదీ లోగా గృహాలు నిర్మించుకోదలచినవారు గ్రామ సచివాలయంలో గాని, నకరికల్లులోని గృహనిర్మాణ శాఖ కార్యాలయంలోగాని దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఆర్ రాములునాయక్ కోరారు. దరఖాస్తుదారులు భార్య, భర్తల బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, పొజిషన్ సర్టిఫికెట్ జతపర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఈఎంఏవై 2.0 అర్బన్, గ్రామీణ పథకం కింద కొత్తగా ఇళ్ళు మంజూరు చేయటానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పీఎం ఆవాజ్ యోజన కింద ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు బీసీ, ఎస్సీలకు రూ 50వేలు అదనంగా, ఎస్టీలకు రూ 75వేలు, పీవీటీజీ వారికి రూ.లక్ష అదనంగా ప్రభుత్వ సాయం అందిస్తున్నట్టు వివరించారు.

అమరజీవికి ఘన నివాళులు

పిడుగురాళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కొరకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం టీడీపీ పట్టణ కార్యాలయంలో జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి యరపతినేని నిఖిల్, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, వీవీ నాగేశ్వరరావు, కోటహరి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఐలాండ్ సెంటర్, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద వున్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, గుడివాడ కుటుంబరావు, కట్టమూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

● రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

పిడుగురాళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి త్వరలో కార్యాచరణ వుంటుందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు తెలిపారు. పల్నాడు జిల్లా ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం ఆదివారం పిడుగురాళ్లలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడేషన్లను త్వరితగతిన ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వంతో మాట్లాడుతున్నామని, మూడు నెలలు ఆగాల్సిన అవసరం లేదని, నెలాఖరులోగా ఇవ్వాలన్నారు. ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులు, యాక్సిడెంట్ పాలసీలు అమలుచేసేలా ప్రభుత్వంతో పలు దఫాలు చర్చలు జరిపామన్నారు. ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్లీనరీ సమావేశం జరుపనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు గతంలో కన్నా గౌరవం వుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు కొంతమేర స్పందించి సహకరిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కొన్ని పత్రికలను సమావేశాలకు బహిష్కరించినట్లు కూటమి ప్రభుత్వం కూడా కొన్ని పత్రికలను అసెంబ్లీ సమావేశాల కవరేజ్‌కి అనుమతి ఇవ్వకపోవడాన్ని ఖండించారు.



సాంబయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఇన్‌సెట్లో కట్టా సాంబయ్య(ఫైల్)

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య మృతి

సత్తెనపల్లి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య(72) ఆదివారం ఉదయం గుండెపోటుతో నందిగామ గ్రామంలో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డితో పాటు టీడీపీ, వైసీపీ నాయకులు పలువురు సందర్శించి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి, తెలిపారు. కట్టా సాంబయ్యది స్వగ్రామం గుడిపూడి కాగా ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నడికూడి రైల్వే జంక్షన్ పరిధిలోని పొందుగుల రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. మృతుడు లైట్ బిస్కెట్ రంగు ఫ్యాయింట్, లైట్ గ్రీన్ కలర్ టీ షర్టు, కాళ్ళకు నలుపు రంగు క్యాన్వాయిస్ ధరించి ఉన్నాడు. ఇతని వద్ద బ్లూ రంగు కలిగిన పోకో కంపెనీ సెల్ ఫోన్ ఉంది. ఇప్పటి వరకు మృతుని తాలూకు ఆచూకీ తెలియ రాలేదు. మృత దేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాల కోసం సీఆర్‌పీ ఎస్ఐలు 9440438256, 9949063960 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సెల్‌ఫోన్‌లో నగదు మాయం

రెంటచింతల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ను అపహరించి అందులో నగదు మాయం చేసిన సంఘటన దాచేపల్లి బస్టాండ్ సమీపంలో జరిగింది. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన పాశం ధనుంజయరెడ్డి హైదరాబాద్ నుంచి నడికుడికి రైలులో పది రోజుల క్రితం వచ్చాడు. రెంటచింతలకు బస్సు ఎక్కే క్రమంలో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. రూ. 1,56,200లను ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి అపహరించారు. ఎస్‌బీఐ అకౌంట్‌లో నగదు ఉంది. ఆదివారం దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

ఆత్మగౌరవానికి అద్వితీయ పట్టాభిషేకం

● అట్టహాసంగా వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

మాచర్లటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కూడలిలో నూతనంగా ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. వడ్డెర సాధికార సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని పార్కు సెంటర్ నుంచి భారీ ర్యాలీగా స్వాగతం పలికారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. మానుకొండ కల్యాణ మండపంలో నిర్వహించిన వడ్డెర ఆత్మగౌరవ చైతన్య సదస్సులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడారు. నరసరావుపేట ఎంపీగా రెండు పర్యాయాలు తన విజయంలో వడ్డెరల పాత్ర ఎంతో కీలకమని, ఇది తానెన్నడూ మరువనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఓబన్న చేసిన స్వాతంత్ర్య పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. సత్రశాలలో వడ్డెర సామాజికవర్గం నూతనంగా నిర్మించిన సత్రానికి నిధులు మంజూరుచేసి, అభివృద్ధికి సహకరిస్తానన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా నిలబడి పనిచేసింది వడ్డెర సామాజిక వర్గీయులేనని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. తన గెలుపులో ప్రముఖపాత్ర పోషించిన వడ్డెర సామాజికవర్గాన్ని అన్నివిధాలుగా కాపాడుకుంటానని హామీనిచ్చారు. వడ్డెర్లకు టీడీపీ ద్వారానే రాజకీయ ప్రాధాన్యత దక్కుతుందని భరోసానిచ్చారు. ఇంకా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం దారునాయక్, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొమెర అనంతరాములు, దుర్గారావు, పిచ్చయ్య మాస్టారు, బత్తుల అనిల్‌కుమార్, కొమెర శివ, చల్లా రాజారత్నం, దేవళ్ల సదా, వెంకన్న, ఓర్సు క్రాంతికుమార్, మంజుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణత్యాగం చేసిన మహనీయుడు శ్రీరాములు

● మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. వాసవీక్లబ్ ఆధ్వర్యాన ఆదివారం శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, మేడం నాగేశ్వరరావు, భవనాసి రవితేజ, చుండూరి సత్యనారాయణ, పోలిశెట్టి పుల్లారావు, తిరువీధి వెంకటనాగేశ్వరరావు, పి.నరసింహారావు పాల్గొన్నారు.

● గురజాలటౌన్: పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యాన పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నేలవల్లి బొల్లయ్య, ఆకుల పిచ్చయ్యగుప్త, బొగ్గవరపు అక్కేశ్వరరావు, చిన్నిశ్రీనివాసరావు, పి.ప్రభు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గి లో ఆదివారం వాసవీ క్లబ్ ఆధ్వర్యాన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యసంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పలుచూరి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పలుచూరి సుబ్బారావు, కాసుల పూర్ణచంద్రరావు, లక్ష్మీనారాయణ, వెచ్చా శ్రీనివాసరావు, కపలవాయి వెంకటేశ్వర్లు, నాగభూషణం, పాదర్తి పుల్లయ్య పాల్గొన్నారు.

● రెంటచింతల: పొట్టి శ్రీరాములు జయంతిని రెంటచింతలలో ఘనంగా నిర్వహించారు. రామాలయం లో సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఆర్ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ వైవీ సైదయ్య, సుమంత్‌రెడ్డి, రాజారెడ్డి, నాళం పెదబాబు, బోడపాటి రామకృష్ణ, ఎన్.శ్రీనివాసరావు, సామ్యేల్, సాగర్ పాల్గొన్నారు.



శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చైర్మన్ నరసింహారావు

● కారంపూడి: కారంపూడిలో ఆర్యవైశ్య సంఘ నేతలు పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, వెచ్చా వరలక్ష్మణరావు, మిత్తింటి సాంబశివరావు, కజ్జం ప్రసాద్, తుమ్మేపల్లి నాగేశ్వరరావు, చీతిరాల వెంకటకోటేశ్వరరావు, కజ్జం పెద ఆంజనేయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆధునిక వైద్యం



సాయికృష్ణ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌తో సత్తెనపల్లి ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఆదివారం ఆయన ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి ప్రాంత ప్రజలకు అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రజలు ఆస్పత్రి వైద్యసేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సినీ దర్శకుడు కొల్లి బాబి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటఅప్పారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, భీమిలి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సందీప్‌లు జ్యోతిప్రజ్వలన చేసి ఆస్పత్రిని ప్రారంభించారు. నిర్వాహకులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ సింగరాజు విద్య, కుటుంబసభ్యులు అతిథులకు స్వాగతం పలికారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన కూటమినేతలు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా తదితరులు

సత్తెనపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ఆదివారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, కోమటినేని శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, బండారు నాగరాజు, లగడపాటి గజానన, నూర్‌బాషా జానీబాబు, ఎలినేడి లక్ష్మి తులసీ, దరువూరి నాగేశ్వరరావు, పచ్చా సుధీర్, కట్టా రమేష్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. ప్రజాచైతన్య పార్టీ సేవా సంస్థ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లో వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జానకిరామారావు, ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, నాసరయ్య, రామకోటయ్య, ప్రభుదాసు, హరిబాబు, ప్రసాదు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార జీవనశైలి మారాలి



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న యరపతినేని నిఖిల్, వైద్యులు నాగమల్లికార్జునరావు, దీపిక తదితరులు

పిడుగురాళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆహార, జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం వుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ తెలిపారు. జానపాడు గ్రామంలో ఆదివారం ఆయు ఫౌండేషన్, వున్నం హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన, టీ కాల కార్యక్రమంలో నిఖిల్ మాట్లాడారు. డాక్టర్లు వున్నం నాగమల్లికార్జునరావు, దీపిక, కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతోపాటు వ్యాయామం, మెడిటేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో 15సంవత్సరాల వయసుగల 100మందికి పైగా బాలికలకు టీకాలను వేశారు. కార్యక్రమంలో వున్నం నరసింహారావు, వున్నం వెంకట్రావు, కూరపాటి కొండలరావు, ముప్పాళ్ల సాంబయ్య, పాల శ్రీను, కోట శ్రీను, బండ్ల వెంకటేష్, చింతలపూడి రామ్మూర్తి, వున్నం సురేష్, మర్యాదరావు, దియ్యా శివప్రసాద్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు హాజరుకానున్న 2600 మంది విద్యార్థులు

క్రోసూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు 2600 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు పెదకూరపాడు ఎంఈవో, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి మండలాల ఇన్‌చార్జ్ ఎంఈవో ఏకుల ప్రసాదరావు తెలిపారు. క్రోసూరు మండలంలోని ఐదు పరీక్షాకేంద్రాల్లో 875మంది, పెదకూరపాడు మండలంలో 496మంది, అచ్చంపేట మండలంలో 551మంది, అమరావతి మండలంలో 665మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

గురజాలటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సాంబశివరావు ఆదివారం తెలిపారు. మండలంలో 721మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 40మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

దాచేపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఆదివారం దాచేపల్లి మహాత్మాగాంధీ విద్యాభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని జడ్పీ హైస్కూల్లో ఈ కార్యక్రమం జరిగింది. జడ్పీ హైస్కూళ్లు, దాచేపల్లి, రామాపురం, గామాలపాడు, కేసానుపల్లి, ముత్యాలపాడు, తంగెడ, మాదినపాడు, పెదగార్లపాడు, బ్రాహ్మణపల్లి, పిన్నెల్లి, మాచవరం, మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ పాఠశాల విద్యార్థులకు సుమారుగా 1100 మందికి ఈ ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ చైర్మన్ తెలనాకుల సత్యనారాయణ, సభ్యులు తెలనాకుల రామ్మూర్తి, దేవరశెట్టి రోజా నాగేశ్వరరావు, వెంకటరావు, నవజ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

పాములయ్య మృతి తీరని లోటు : కొమ్మాలపాటి

పెదకూరపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పాములయ్య అకాల మృతి కుటుంబానికి, టీడీపీకి తీరనిలోటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. టీడీపీ మండల సీనియర్ నాయకుడు దుప్పటి పాములయ్య (78) శనివారం రాత్రి స్వగృహంలో మృతిచెందారు. ఆదివారం పాములయ్య మృతదేహాన్ని కొమ్మాలపాటి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. పాములయ్య మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, పొట్టి నాగమల్లేశ్వరరావు, మద్దినేని నరసింహారావు ఘనంగా నివాళులర్పించారు.

18న స్కిల్ డెవలప్‌మెంట్ జాబ్‌మేళా

క్రోసూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 18వ తేదీన క్రోసూరు ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా మేనేజర్ ఈ తమ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతలను బట్టి రూ.12వేల నుంచి రూ.32వేల వరకు వేతనం ఇస్తారన్నారు. 18నుంచి 45 సంవత్సరాల లోపు వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎస్ఎస్‌సీ నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ డిప్లమో, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణపత్రాలు, ఆధార్ నకలు, పాస్‌ఫోర్టు సైజు ఫోటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. 18న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4వరకు క్రోసూరులోని పాల్‌టెక్నిక్ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 7779858789, 8074393466 నెంబరులో సంప్రదించాలన్నారు. జాబ్‌మేళాకు కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గోదావరి, ఆంధ్రా కార్పొరేటివ్ సొసైటీ లిమిటెడ్, నికోమార్క్, ఐటీసీ, కిపిస్టర్ సర్వీసెస్ కంపెనీలు హాజరవుతాయన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 29.97 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

మూడు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి) నేటినుండి ప్రారంభం కానున్న పదవ తరగతి కామన్ పరీక్షలకు అమరావతిలో మూడుసెంటర్లలో ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షలకు 650 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎంఈఓ శివబాబు తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద అన్నివసతులు కల్పించినట్లు చెప్పారు.

మంత్రాలమ్మ కనుమ వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేయండి

కారంపూడి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంత్రాలమ్మ కనుమ సరిహద్దుల్లో రిజర్వాయర్ ఏర్పాటుచేస్తే 23 గ్రామాల రైతులకు సాగునీరందుతుందని రైతు కమిటీ కన్వీనర్ అన్నంగి నాగేశ్వరరావు అన్నారు. కారంపూడిలో రిజర్వాయర్ ఏర్పాటుపై నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ఆదివారం వినతిపత్రాలు అందించామన్నారు.

భాషా రాష్ట్రాలకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు: కొమ్మాలపాటి



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అశువులు బాసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడులో పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొమ్మాలపాటి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు పొట్టి సత్యనారాయణ, పొట్టి నాగమల్లేశ్వరరావు, పొట్టి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, డాక్టర్ గుడిపూడి చినరాజు, వడ్లమూడి అప్పారావు, మద్దినేని నరసింహారావు, షేక్ మస్తాన్ షరీఫ్, అవ్వారి సంజీవరావు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ నివాళి

పొట్టి శ్రీరాములు విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట సీపీఐ శ్రేణులు కొమ్మాలపాటి శరత్ జ్యోతిశ్రీ, మునునూరి రమేష్, మునగోటి శ్రీనివాసరావు, మాదినేని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: అచ్చంపేటలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు ఏలూరి శ్రీనివాసరావు, వెంకటకోటిలింగం, అడ్డగిరి వెంకటసాంబ, పార్థసారధి, భవిరిశెట్టి రవికుమార్, ఆలపాటి జనార్ధన్‌కుమార్, గూండా రమేష్ బాబు, బూర్ల నరసింహారావు, వీరవల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● క్రోసూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం క్రోసూరులోని గాంధీచౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కంభంపాటి బాబు, రత్నాకరరావు పాల్గొన్నారు.

రూ.225 కోట్లతో గురజాల నియోజకవర్గ అభివృద్ధి

● కార్యాచరణలో ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో ఇంటింటికి తాగునీరు అందించేందుకు రూ.225 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్లకు రూ.150కోట్లు, దాచేపల్లికి రూ.48కోట్లు, గురజాలకు రూ.28 కోట్లతో తాగునీటి పథకాలకు నిధులు మంజూరయ్యాయి. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు ఈ నిధులతో మంజూరుచేశారు. వైసీపీ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన మున్సిపల్ కార్యాలయ భవననిర్మాణాన్ని రూ.50లక్షలతో పూర్తి చేయించడం, పిడుగురాళ్ల బైపాస్ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పాటు సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.10కోట్ల వ్యయంతో చెరువు ప్రాంతంలో ఇండోర్, అవుట్‌డోర్ ఆడిటోరియంలను ఏర్పాటుచేసి పట్టణవాసులకు ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పిడుగురాళ్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు. పల్నాడులో యువపారిశ్రామికవేత్తలను తయారుచేసేందుకు గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల ప్రాంతాలలో గుర్తించిన ప్రభుత్వ భూములను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటుచేసి ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయించారు. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ఒక పర్యాయం పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం జరిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం మరోసారి సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. చేపట్టనున్న పనులు రాబోయే మూడేళ్లలో పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేలా యరపతినేని ప్రణాళికను సిద్ధంచేశారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సూచనలు తీసుకునేందుకు పార్టీలకు అతీతంగా త్వరలో ఓ సమావేశాన్ని కూడా ఏర్పాటుచేసేందుకు సమాయత్తమవుతున్నారు.





ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ సంతోష్‌కుమార్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో సురేష్

నేతి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎస్పీ ప్రత్యేకపూజలు

రాజుపాలెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు మత్స్యావతార శ్రీనేతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీకి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పాల్గుణ మాసంలో వచ్చే స్వామివారి ఉత్సవాలు ఏలా చేస్తారని ఎస్పీ శ్రీనివాసరావు అడిగి తెలుసుకున్నారు. భక్తుల దర్శనార్థం ఏర్పాటుచేసిన క్యూలైన్లను పరిశీలించారు. సాయంత్రం జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోషకుమార్ దంపతులు స్వామివారి ఆలయానికి వచ్చి ప్రత్యేకపూజలు చేశారు. వారిరువురికి ఈవో సురేష్ స్వామివారి చిత్రపటాలను బహూకరించారు. వారి వెంట సీఐ సుబ్బారావు, ఎస్సై వేణుగోపాల్ ఉన్నారు.

చెస్ ఆటతో చురుకుదనం : మున్సిపల్ కమిషనర్

మాచర్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుం చి చెస్ ఆడితే చురుకుదనం పె రుగుతుందని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు అ న్నారు. ఆదివారం పట్టణంలోని కోదండ రామాలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యాన పల్నాడు చెస్ అ కాడమీ సహకారంతో నిర్వహించిన మూడు జిల్లాల స్థాయి చెస్‌పోటీలను ఆ యన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావులు మాట్లాడుతూ చెస్ ఆడడం వలన జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, చెస్ కోచ్ కిరణ్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భవనాసి రవితేజ, బచ్చు రాజ్‌కుమార్, పందిరి నరసింహారావు, తిరువీధి వెంకటనాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, చుండూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

యోధుల సేవలు చిరస్మరణీయం: ముప్పాళ్ల



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

పెదకూరపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సాయుధ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన యోధులు ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. పెదకూరపాడులో సీపీఐ ఆధ్వర్యంలో శత వార్షికోత్సవాలను పురస్కరించుకొని అమరజీవుల సంస్మరణ సభను ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముప్పాళ్ల మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దర్శి లక్ష్మయ్య, సాయుధ పోరాట యోధులు అంబటి హనుమంతరావు, దర్శి పానకాలరావు, తురకా చిన్నప్ప స్థూపాల వద్ద నివాళులర్పించామన్నారు. ముందుగా కచేరి సెంటర్‌లో స్థూపాల వద్ద సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాదు, సహాయకార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, ప్రజానాట్యమండలి కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, మునగోటి శ్రీనివాసరావు, మాదినేని సుధాకర్, అవ్వారి రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరావుకు పురస్కారం

రాజుపాలెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనాథ పిల్లల, వృద్ధాశ్రమ నిర్వాహకుడు గరికపాటి శంకరావుకు పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ చైర్మన్ టి.ఉమాశంకరావు, సభ్యులు ఆదివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పురస్కారం అందుకున్నారు. గత ఇరవై ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఎంతోమంది అనాథపిల్లలు, వృద్ధుల కొరకు ఆశ్రమం నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి పొన్నూరులోని బ్లడ్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా చైర్మన్ టీ ఉమాశంకరావు, ప్రముఖ కవి, రచయిత రంగిశెట్టి రమేష్, చందు సాంబశివరావు పురస్కారం అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దాచేపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించగా 50మందికి ఆపరేషన్‌లు అవసరమైనట్టు వైద్యులు తెలిపారు. ఆదివారం దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని సహకారంతో టీడీపీ నేత చికెన్ జానీబాషా ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముత్యాలంపాడు, సారంగపల్లి అగ్రహారం, మాదినపాడు, భట్రుపాలెం, కాట్రపాడు, కొత్తూరు, శంకరాపురం, తంగెడ గ్రామాలవారు హాజరయ్యారు. ఆపరేషన్‌లు అవసరమైనవారిని సోమవారం గుంటూరులోని శంకర్ వైద్యశాలకు తరలించనున్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో... ప్ల కార్డుల ప్రదర్శన

డ్రగ్స్ వద్దు బ్రో.. అనే నినాదంతో దాచేపల్లి పోలీసులు సీఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నడికూడి రైల్వేస్టేషన్ సమీపంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే పరిణామాలను ప్రజలకు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ కోసం కట్టుబడి ఉండాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు పాపారావు, సౌదర్ రాజన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పుస్తకాల పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో చదివే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు పంపిణీ చేశారు. 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. సాహితీవేత్త, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ పీవీ సుబ్బారావు విద్యార్థులకు పరీక్ష రాసే విధానం, పరీక్ష హాలులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అంకమ్మరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సభ్యులు నలమాల దానయ్య, వి.చంద్రం పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అమరజీవి త్యాగం మరువలేనిది

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి కోసం ఆంధ్ర రాష్ట్రం కావాలంటూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. కులవివక్ష అధికంగా ఉన్న ఆ రోజుల్లో సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, పట్టణ ప్రముఖులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగశ్రీను మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మ త్యాగం తెలుగువారి దృఢసంకల్పానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పి.అభిమన్యు, ఎ.అనిల్‌కుమార్, టి.అనిల్, టి.రమేష్, తిరుమల, జి.రమేష్, శివ, చిరంజీవి, అనిల్, శివసాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భిమానాలు ఉన్నాయని, ఉమ్మడి నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టడమే అందుకు నిదర్శనమన్నారు. అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేయాలన్న చంద్రబాబు ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని, వాసవీమాత జన్మదినాన్ని అధికారికంగా ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నిర్ణయాన్ని ప్రజలందరూ స్వాగతించాలన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై హర్షం వ్యక్తంచేసిన ఆర్యవైశ్యులు ప్రత్తిపాటి సమక్షంలో చంద్రబాబు చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు చేవూరి కృష్ణమూర్తి, గుర్రం సాంబశివరావు, తవ్వ నాగమల్లేశ్వరరావు, మేళ్లచెరువు గోపాల్, కొప్పురావూరి రాధాకృష్ణ రాచుమల్లు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

పట్టణంలోని భాస్కర్ థియేటర్ సెంటర్లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శ్రీనునాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, తాడిబోయిన వీరేంద్ర నాథ్, కంచర్ల శ్రీనివాసరావు, కె.రామాంజనేయులు, కొర్నేపాటి నాగరాజు, చందవరం హరిప్రసాద్, ఉప్పు మణికంఠ, ఆర్ మోహన్‌నాయక్, బి.బంగారునాయక్, షేక్ వలి పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరులో పొట్టి శ్రీరాములు 124వ జయంతి వాసవి క్లబ్ అధ్యక్షుడు గజ్వేలు సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ అర్వపల్లి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కోట శ్రీనివాసరావు, కజ్జాయం లక్ష్మీనారాయణ, కోట సుబ్బారావు, జి.రామారావు, జి.శ్రీను, కె.రామారావు, కోట శ్రీనివాసరావు, దేశు కోటేశ్వరరావు, కోట పట్టాభి, కోట ఆదినారాయణ, శిఖాకొల్లి ధర్మతేజ, కజ్జాయం కిష్టారావు, పలువురు ఆర్యవైశ్య నాయకులు ఉన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణంలో టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 124వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చదలవాడ ఆదిత్య, సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కూటమి నేతలు పాల్గొన్నారు,

● నరసరావుపేట టౌన్: తెలుగువారి ఆత్మగౌరవం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షచేసి, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 124జయంతి సందర్భంగా శివుని బొమ్మ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అత్తులూరి సుబ్బారావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా నిర్వహించాలని జీవోని ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ అర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ళ సత్యనారాయణ, తడికమళ్ల బాల, ఐనవోలు సాంబశివరావు, కె.హనుమంతరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వి.సాంబశివరావు, కె.మోహర్, ఎం.హరి, డి.విజయ్, సి.కాంత్, ప్రకాష్, శివ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ ఆదిత్య, కొల్లి బ్రహ్మయ్య, తదితరులు

అమరజీవి గురించి నేటి తరం తెలుసుకోవాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన ఆత్మార్పణ త్యాగం గురించి నేటితరం తెలుసుకోవాలని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అంజలి ఘటించిన అనంతరం మాట్లాడుతూ ఆ త్యాగమూర్తిపై చంద్రబాబుకు ఎంతో గౌరవా



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరంలో ప్రగతి నారీ శక్తి సంక్షేమ సంఘం, కాటూరి వైద్యశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్య పరీక్షల మొబైల్ ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాటూరి వైద్యశాల వైద్య బృందం సుమారు ఐదు వందల మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసింది. కార్యక్రమాన్ని వైద్యశాల బీడీవో రామకృష్ణ, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావులు, సంస్థ వ్యవస్థాపకులు పొట్లూరి దేవి, పెంటాల శ్రీనివాసరావు, శేషయ్య, సింధూరి, హరిబాబు తదితరులు పర్యవేక్షించారు.

శ్రీపదం గ్రాండ్ హోటల్ ప్రారంభం



శ్రీపదం గ్రాండ్ హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట సెంటర్లో స్టేట్ బ్యాంక్ పక్కన నూతనంగా నిర్మించిన శ్రీపదం గ్రాండ్ హోటల్‌ను స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ప్రారంభించారు. పెద్ద నగరాల స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో బ్యాంకట్ హాల్స్‌ను, మినీ కన్వెన్షన్‌ను, ఏసీ గదులు ఏర్పాటుచేసి, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించినందుకు గాను ఆ సంస్థ అధినేత డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావును ఈ సందర్భంగా ప్రత్తిపాటి అభినందించారు. సంస్థ అధినేత డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, దర్శి టీడీపీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాస్తి రంగారావు, డాక్టర్ ముద్దన రమేష్‌బాబు, డాక్టర్ మక్కెన వంశీకృష్ణ, డాక్టర్ రేష్మ, కొమ్మినేని శోభారాణి, మక్కెన నరసింహారావు, ముద్దన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ లెవెల్ టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్ 14, 15 తేదీలలో ఘనంగా నిర్వహించామని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు గొప్ప విషయం అన్నారు. అకడమిక్స్‌లో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. మొదటి రోజు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, షార్ట్ ఫిల్మ్, క్విజ్ కార్యక్రమాలు నిర్వహించారు. కబడ్డీ, త్రోబాల్, చెస్ పోటీలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు కళాశాల మైదానంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేశారు.

జనగణనతోపాటు కులగణన కూడా చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

నరసరావుపేట టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రం 2025న జరిపే జనగణనతోపాటు ఓబీసీ కులగణన చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం ఏపీ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారు దేశాన్ని పాలించే రోజులలో 1881 నుంచి 1931 వరకు ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కల సేకరణలో కులగణన జరిగిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు అయినప్పటికీ బీసీలను చిన్నచూపు చూస్తున్నారనటానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. కేవలం ఎన్నికల వేళలో ఏదో ఒక కమిటీని వేయటం, కాలయాపన చేయడం మాత్రమే జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మిట్టపాలెంలో ఆదివారం అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కారంచేటి వెంకట పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు జరిపి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నంబొట్లవారిపాలెం గ్రామ మహిళలచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. సుమారు 3వేల మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. విగ్రహదాత నాగభైరు లక్ష్మీ సరోజిని, ఒంటి విగ్రహ దాతలు కె మురళీకృష్ణ, కె శ్రీదేవి, నిర్వాహకులు నాగభైరు కామేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్. మార్చి 16: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజార్లోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ రాతి నిర్మాణానికి పట్టణానికి చెందిన ఆవుల సత్రం కమిటీ సెక్రటరీ పుల్లారావు, సుబ్బాయమ్మ, మెహర్‌కృష్ణ, సమతలు దేవాలయ నిర్మాణానికి ఒక లక్ష 1116, దేవస్థానం కమిటీకి ఆదివారం అందజేశారు.

రైతులకు కొండంత అండగా ప్రభుత్వం: చీఫ్ విప్ జీవీ



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

శావల్యాపురం, మార్చి 16, (ఆంధ్రజ్యోతి) రైతులకు కొండంత అండగా ప్రభుత్వ పాలన సాగుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం మండలం కారుమంచి గ్రామంలో నూతనంగా నిర్మించిన హెచ్పి పెట్రోల్ బంక్, జనౌషాధి కేంద్రాల ప్రారంభోత్స కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జీవీ ఆంజనేయులు గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ తోపాటు జనౌషధి కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 129 ఏళ్ల చరిత్ర కలిగిన సొసైటీలను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం కారుమంచి, ఈపూరు అంగలూరు సొసైటీలు అభివృద్ధి పథంలో పయనిస్తూ రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పాలనలో జగన్‌మోహన్ రెడ్డి రైతు పథకాలన్నీ ఎత్తివేసి అన్యాయం చేశాడని, రైతులకు రాయితీలపై ఇవ్వాల్సిన యంత్ర పరికరాలివ్వకుండా పంగనామం పెట్టారని విమర్శించారు. రాష్ట్రాన్ని రూ.10,50,000 కోట్లు ఊబిలోకి నెట్టి సర్వనాశనం చేశాడన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ సేల్స్ అధికారి ప్రవీణ్ కుమార్, డీసీఎం వెంకటరమణ, పర్సన్ ఇన్‌చార్జి సురేంద్ర కుమార్ సొసైటీ సీఈవోలు వెంకటనారాయణ, నాగ ప్రసాద్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జి. సాంబశివరావు, టీడీపీ సీనియర్ నాయకులు వై.కోటేశ్వరరావు, జి.విశ్వనాథం, గోరంట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు జీవీ ఇఫ్తార్

వినుకొండ టౌన్ మార్చి 16, (ఆంధ్రజ్యోతి)పట్టణంలోని రణహౌస్సేన్ పంజాలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన రంజాన్ పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లింలు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి శివశక్తి ఫౌండేషన్ ఫ్రిజ్ వితరణ

వినుకొండ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆర్థిక సాకారంతో నూతన ఫ్రిజ్‌ను కొనుగోలు చేసి టీడీపీ నాయకులు, ఫౌండేషన్ సిబ్బంది వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పర్వీన్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు పర్వీన్ మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్య బృందాలు వైద్యశాలలకు తనిఖీకి వస్తున్న నేపథ్యంలో వైద్యశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. వైద్యశాలకు ఫ్రిజ్ కావాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీను అభ్యర్థించగా వెంటనే ఫౌండేషన్ సకారంతో రూ.14,600 వెచ్చించి ఫ్రిజ్ కొనుగోలుచేసి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ లీలావతికి వైద్యశాల సిబ్బంది తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీ సురేష్, గట్టుపల్లి శ్రీను, మోటుపల్లి నరసింహారావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో ఎస్ఎస్ఎన్ విద్యార్థికి బంగారు పతకం

నరసరావుపేట టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి వీ తులసితన్మయి ఉమెన్ అండర్ 49కేజీల తైక్వాండో విభాగంలో బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ ఆదివారం అన్నారు. తెనాలి ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15న జరిగిన గుంటూరు జిల్లా ఇన్విటేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీలలో ఈ ఘనత సాధించిందన్నారు. పతకం సాధించిన వీ తులసి తన్మయిని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ముగిసిన మెగా జాబ్ మేళా

● 206మంది విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆదివారం హెచ్ఆర్ అండ్ కో సహకారంతో నిర్వహించి మెగా జాబ్ మేళా విజయవంతం అయింది. 22 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. వివిధ కళాశాల నుంచి 647మంది విద్యార్థులు పాల్గొన్నారు. 206 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

మహంకాళి అమ్మవారికి ఎంపీ ప్రత్యేక పూజలు

నరసరావుపేట రూరల్, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుప్పాలెంలోని మహంకాళి అమ్మవారి 50వ మహోత్సవం వేడుకల్లో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు ఆయన వెంట 13వ అదనపు జిల్లా కొట్టు ఏజీపీ కే సీతారామాంజనేయులు న్యాయవాదులు పాశం కోటి నాగయ్య, డి.సురేష్ బాబు, బండ్లమూడు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు

ఘనంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ళ

బొల్లాపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడులో నీలంపాటి అమ్మవారి తిరునాళ్ళ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి గుడి వద్ద భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ అమ్మవారి భక్తి సంగీతాలను ఏర్పాటుచేశారు. అమ్మవారి తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఈ బాలకృష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు రెడ్డి పేరంటాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

నాదెండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో సుమారు రూ 2 కోట్ల వ్యయంతో పునఃర్నిర్మాణం చేసిన రెడ్డిపేరంటాలమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 10:41 గంటలకు విశేష పూజల మధ్య ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. సుమారు 30 వేల మందికి అన్నదానం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలి రానుండటంతో డీఎస్పీ కే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావుల ఆధ్వర్యంలో వాహనాల దారి మళ్ళింపు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తుతో ఏర్పాట్లు చేస్తున్నారు.